విశాలాంధ్ర విశాఖపట్నం
పేజి నెం. 5
బుధవారం 12, ఫిబ్రవరి, 2025

విద్యార్థులకు నాంది ఫౌండేషన్ చేయూత

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనందపురం మండలం బోయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 6, 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీలకు నాంది ఫౌండేషన్ వారు 71 మంది విద్యార్థులకు కిట్లు, స్పోర్ట్స్ షూస్, నోటు పుస్తకాలు, టీషర్ట్స్, క్రీడా సామాగ్రి అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండబాబు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ నాంది ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ అని, చక్కటి అవకాశాన్ని విద్యార్థులు విద్యార్థులు వినియోగించుకోవాలని క్రీడా రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చెల్లా.రామిరెడ్డి, నాంది స్కిల్ అసోసియేట్ ట్రైనర్ కీర్తన, ఉపాధ్యాయుల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 17 నుంచి ఏప్రిల్ 01 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

డీఆర్వో సీతారామారావు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : మార్చి 17 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా ఇన్చార్జి రెవెన్యూ అధికారి సీతారామారావు ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం వహించి పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలను సకాలంలో పూర్తి చేసి పరీక్షల నిర్వహణకు అందరూ సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. మార్చి 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్, ప్రయివేటు, ఓపెన్ ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై డీఈవోతో కలిసి మంగళవారం ఉదయం కలెక్టరేట్ వీసీ హాలులో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాలు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు.

134 కేంద్రాలు, 29,997 మంది విద్యార్థులు

సమీక్షలో భాగంగా డీఈవో ఎన్. ప్రేమ్ కుమార్ పలు వివరాలను వెల్లడించారు. మార్చి 17వ తేదీ నుంచి ఏప్రిల్ ఒకటి వరకు 134 కేంద్రాల్లో జరిగే పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 28,523, ఓపెన్ విద్యార్థులు 1,404 కలిపి మొత్తం 29,997 మంది హాజరవుతున్నారని పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు రోజూ ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు, ఓపెన్ విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఏఏఅలాగే మార్చి 03 నుంచి 15వ తేదీ వరకు ఓపెన్ ఇంటర్ విద్యార్థులకు రోజూ ఉదయం 9.00 నుంచి 12.00 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. రెండు కేంద్రాల్లో జరిగే ప్రయోగ పరీక్షలకు 404 మంది, ఏడు కేంద్రాల్లో జరిగే థియరీ పరీక్షలకు 1,271 మంది హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. అన్ని విభాగాల అధికారులు పూర్తి సమన్వయం వహించి పరీక్షలను విజయవంతంగా నిర్వ హించటంలో పూర్తి సహకారం అందించాలని ఈ సందర్భంగా డీఈవో విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, జీవీఎంసీ, వైద్యారోగ్య, రవాణా, విద్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల షెడ్ కూల్చివేతలో జీవీఎంసీ అత్యుత్సాహం

చీఫ్ సెక్రటరీకి ఈఏఎస్ శర్మ పిర్యాదు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : అనధికార నిర్మాణాలపై జీవీఎంసీ అధికారులు ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నారని, గిరిజనుల షడ్ ను కూల్చివేసారని మాజీ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ కు పిర్యాదు చేశారు. వీధి వ్యాపారులు, చెంచు వలసదారులు వంటి చిన్న వ్యక్తులపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తారని, పెద్ద పెద్ద అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవట్లేదని తెలిపారు. విశాఖ లోని టిడ్కో గృహ సముదాయం ఉంది, దీనిలో ప్రభుత్వంతో సుదీర్ఘమైన పోరాటం తర్వాత దాదాపు 60 మంది చెంచులకు పునరావాసం కల్పించారు. వారు ప్రార్థనల కోసం కాంప్లెక్స్‌లో తాత్కాలిక టిన్ రూఫ్ షెడ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. షెడ్ వేసిన వెంటనే, కొంతమంది మతపరమైన వ్యక్తులు జీవీఎంసీకి ఫిర్యాదు చేశారు. వారు యుద్ధప్రాతిపదికన వచ్చి షెడ్‌ను కూల్చివేశారు. నోటీసు గానీ, ముందస్తు సమాచారం గానీ ఇవ్వకుండా హఠాత్తుగా వచ్చి కూల్చివేయడం దారుణమన్నారు. గిరిజనులైన చెంచులు షెడ్ ఏర్పాటుకు జీవీఎంసీ నుంచి అనుమతి తీసుకోకపోవడం తప్పు చేశారనేది నిజమే కావచ్చు, ఎందుకంటే వారు పివిజీటి గిరిజన సమూహానికి చెందినవారు .అధికారులు వారి అవసరాన్ని కొంచెం ఓపికగా చర్చించి ఉండవచ్చు.వారు తాత్కాలికంగా షెడ్ ను ప్రార్థనల కోసం ఏర్పాటు చేసుకున్నారు.వైజాగ్ బీచ్ వెంబడి నగరం నుండి భీమిలి వరకు సి ఆర్ జెడ్ నిబంధనలు తీవ్రంగా ఉల్లంఘించి భారీ నిర్మాణాలు ఏర్పడ్డాయి. వాటి మీద చర్యలు తీసుకోలేదు. పేద,ధనిక వర్గాలకు ఒకే రకమైన నిబంధనలు అమలు చేయాలని , ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన పెందుర్తి చిన్నారులు

విశాలాంధ్ర - పెందుర్తి : విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అబాకస్, వేద గణిత పోటీల్లో పెందుర్తి శారద అబాకస్ విద్యా సంస్థకు చెందిన జి.దీపాంశి, హయగ్రీవ హాసిని, వినయశ్రీ, ఉజ్వలి ప్రథమ స్థానంలో నిలిచారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు విశ్వం ఎడ్యు టెక్ సీఈఓ జగదీష్ బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేసారు. అలాగే అబాకస్ పాఠశాల ప్రిన్సిపల్ సయ్యప రాజ్, క్రాంతి సుధా, సహ విద్యార్థులు వారికి అభినందనలు తెలియజేశారు.

సింహాద్రి నాథుని దర్శించుకున్న పోస్టల్ అధికారులు

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారిని భారత పోస్టల్ అధికారి దేవి రెడ్డి, ఎస్.వి.ఆర్ మూర్తి దర్శించున్నారు. వీరికి సహయ కార్యనిర్వహణాధికారి ఎన్ ఆనంద్ కుమార్ పూలమాల అందజేసి ఘన స్వాగతం పలికారు. తొలుత వీరు కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని, స్వామివారికి తమ గోత్ర నామాలతో సంకల్పం చెప్పించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. పిదప ఏ. ఈ. ఓ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సీపీఐ కార్యకర్తల సమావేశం

విశాలాంధ్ర - తగరపువలస : తగరపువలస మెయిన్ రోడ్ సీపీఐ కార్యాలయంలో కార్యకర్తలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సీపీఐ భీమిలి ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు పేద ప్రజలకు అర్బన్ ఏరియాలో రెండు సెంట్లు స్థలము గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు స్థలము ఇస్తారని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. మోర అప్పలరాజు మాట్లాడుతూ మరఅందరికీ వివిధ రకాల పెన్షన్ త్వరితగతిన అందజేయాలని సీపీఐ పార్టీ తరపున కోరారు. సచివాలయ ఉద్యోగుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ అది మీరు పర్యవేక్షణ చేసి ప్రజలకు సరైన సేవలను అందించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు ఆదినారాయణ సభ్యులు సన్నిబాబు లక్ష్మణరావు గోవిందు కే రమేష్ సత్య రావు మొదలగు కార్యకర్తలు పాల్గొన్నారు.

184 కేజీల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్ : విశాఖపట్నం జిల్లా , గాజువాక లో గంజాయి అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీసీపీ మేరీ ప్రశాంతి తెలిపారు సిటీ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. కణితి రోడ్డు ఉడా కాలనీలో గల ఇంటిలో కొందరు వ్యక్తులు గంజాయిని విక్రయిస్తు న్నారనే సమాచారం రావడంతో ఆ ప్రాంతానికి వెళ్లి.. 8 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. వారి వద్ద నుంచి 184 కిలోల గంజాయిని,ఒక కియా కారునూ,8 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గాజువాక కు చెందిన ఇమ్రాన్ ఖాన్, మల్కాపురానికి చెందిన అర్జున్ కుమార్,జైపూర్ కు చెందిన కోరాడ బాలకేజీ కృష్ణ,ఒరిస్సా రాష్ట్రానికి చెందిన బిదేశి కుమార్ సాహు,దామా ఖరా, శుక్ర మతం,రామచంద్ర సిషా,మనోజ్ ఖేముండులను అరెస్టు చేసినట్టు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పట్టణ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు డీసీపీ తెలిపారు.

శ్రీమర్లమాంబను దర్శించుకున్న ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 97వ వార్డు పులగాలిపాలెం గ్రామంలో శ్రీ మర్లమాంబ అమ్మవారి పండగ మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. పులగాలిపాలెం సహా ఆ ప్రాంత ప్రజలు అమ్మ వారిని దర్శించుకుని ధూప దీప నైవేద్యాలతో పూజలు చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసే తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక నాయకులు అయితి సింహాచలం, ఆర్ఎస్ నాయుడు, ఆవగడ్డ సోమనాయుడు, రాయవరపు సురేష్, మేడిశెట్టి అప్పారావు, భక్తిమాల, సోమశేఖర్ నాయుడు, హార గోపాల్, మజ్జి సూరిబాబు, తనకాల శీను, మోటూరు చైతన్య, కిషోర్, పార్వతి, నాగ సుధ, వరూధిని తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దైవ ఆరాధనతో మనసు ప్రశాంతతకు నాంది : గంటా నూకరాజు

విశాలాంధ్ర - తగరపువలస : రోజూవారి కార్యాచరణలో కొంత సమయం అయినా దైవత్వం ప్రార్థనలో నిమగ్నమైనప్పుడు మనసు నిలకడగా, ప్రశాంతంగా ఉంటుందని ఇదే సకల జనుల ఆనందానికి నిలయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. భీమిలి జోన్ 3వ వార్డు ఎన్టీఆర్ కోలనీలో ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం మూడవ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అల్లిపిల్లి వేణు, పీతల అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలు, అన్న సమారాధనకు భీమిలిలో ఉన్న ప్రముఖ నాయకులతో పాటు గంటా నూకరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం మన దేశం నినాదమని, సకల జనుల సమ్మేళనం హిందూధర్మ సిద్ధాంతామని అన్నారు. ఎవరైనా ఏ మతం వారైనా తన ఇష్ట దైవం ప్రార్థన కోసం కొంత సమయం కేటాయించుకున్నట్లయితే మనసు నిలకడగా ఉండి సంపూర్ణ ఆరోగ్యానికి శ్రీకారం చుడుతుందని అన్నారు. అందరూ భాగుండాలని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని గంటా నూకరాజు ఆకాంక్షించారు. ఇంతమంచి కార్యక్రమానికి నాంది పలికిన ఆలయ ముఖ్యులు అయినటువంటి అల్లిపిల్లి వేణు మరియు పీతల అప్పారావులకు నా హృదయ పూర్వక కృతజ్ఞతలు అని గంటా నూకరాజు అన్నారు. ప్రతీ ఏడాది కొన్ని వేలమంది భక్తులకు అన్నసమారాధన చేయాలన్న ఆలోచన చాలా గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్ పంచకర్ల సందీప్, పట్టణ ప్రముఖులు మైలపల్లి షణ్ముఖరావు, శిల్లా కరుణాకర్ రెడ్డి, అల్లిపిల్లి నర్సింగరావు, కదిరి జగన్నాదం, సన్యాసిరావు, గండిబోయిన పోలిరాజు, పుక్కళ్ళ అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

విమెన్ ఎంపవర్మెంట్ త్రు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి లెక్చరర్ ఇన్ కామర్స్ ప్రచురించిన "విమెన్ ఎంపవర్మెంట్ త్రు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్" అనే పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఆర్ మంజుల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజుల మాట్లాడుతూ డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి స్ఫూర్తితో అందరు అధ్యాపకులు అనేక పుస్తకాలు ప్రచురించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో తోటి అధ్యాపకులు పాల్గొన్నారు.

సింహాద్రి నాథుని ఆలయ పైకప్పు (స్లాబ్) కు కెమికల్ ట్రీట్ మెంట్ షురూ

విశాలాంధ్ర - గోపాలపట్నం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయం పై కప్పు (స్లాబ్) లీకేజి కాకుండా కెమికల్ ట్రీట్ మెంట్ చేస్తున్నామని అందుకు సంబంధించిన వివరాలు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కు కార్యనిర్వహణాధికారి వి త్రినాధరావు, స్థానిక 98వ వార్డ్ కార్పొరేటర్ పీవీ అందజేసారు. ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి. మహారాష్ట్రలోని పూణేకు చెందిన లార్డ్ వేంకటేశ్వర చారిటబుల్ అండ్ రిలీజియస్ ట్రస్ట్ ఈ పనులను ఉచితంగా చేసేందుకు ముందుకు వచ్చింది. పురాతన ఆలయాల మరమ్మతులకు అనుసరించే విధానాలతో పనులు చేపట్టనుంది. ఈమేరకు దేవదాయశాఖ చీఫ్ ఇంజినీర్ జి.వి.ఆర్.శేఖర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. రానురాను ఆలయం పైభాగంలో రంధ్రాలు ఏర్పడి వర్షం నీరు లోపలకి చేరుతోంది. ముఖ్యంగా ప్రధాన ఆలయంతో పాటు కల్యాణమండపంలో, వంటశాలలో నీరు చేరుతోంది. సుమారు ఇరవై ఐదేళ్ల క్రితం అప్పటి ఈవో వి. శంకరరెడ్డి శాండ్ బ్లాస్టింగ్ పనులు చేయించి కొంతమేర లీకేజీలను సరిదిద్దారు. కానీ ఆ పనులు ద్వారా పూర్తిస్థాయిలో ఆశించినంత ఫలితాలు రాకపోవడంతో మళ్లీ పరిస్థితి యథాస్థితికి వచ్చింది. 2009లో అప్పటి ఈవో దివంగత ప్రేమ్ కుమార్ హయాంలో ఫోర్స్ రాక్ సిస్టం పద్ధతిలో ప్రత్యేక మెటరియల్ ను రంధ్రాలు ద్వారా పంపి ఆలయ బేడామండపం తదితర ప్రదేశాల్లో లీకేజీలను సరిదిద్దారు. ఆ విధానంతో కొన్నేళ్ల పాటు లీకేజీలు తగ్గుముఖం పట్టాయి. కొన్నిచోట్ల ప్రతీ ఏడాది కురుస్తున్న వర్షాలకు మళ్లీ వర్షం నీరు లోపలకి వచ్చి చేరుతోంది. ముఖ్యంగా ప్రధాన ఆలయం, కల్యాణ మండపం, వంటశాలలో వర్షం నీరు లోపలికి వస్తోంది. దీంతో రాష్ట్ర దేవదాయశాఖ, సింహాచలం దేవస్థానం ఇంజినీరింగ్అధికారులు ఈ విషయంపై పూణేకు చెందిన లార్డ్ వేంటేశ్వర చారిటబుల్ అండ్ రిలీజియస్ ట్రస్టు సంప్రదించారు. ఆ ట్రస్ట్ ఇప్పటికే శ్రీకాళహస్తి, శ్రీశైలం దేవస్థానాల్లో మరమ్మతు పనులు చేసింది. దాంతో ఆ సంస్థ ప్రతినిధులు వేంకటేశ్వరరావు, జమీల్ గత ఏడాది నవంబరులో సింహాచలం వచ్చి ఆలయ పైకప్పు, ఇతర ప్రదేశాలను పరిశీలించారు. పురాతన ఆలయాల మరమ్మతులకు అనుసరించే పద్ధతులతో మరమ్మతులు చేయాలని వారంతా భావించారు. అలాగే శాస్త్రపరంగా కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా కెమికల్ ట్రీట్మెంట్ ద్వారా పనులు పూర్తిచేయడానికి సంసిద్ధమయ్యారు. సిమెంట్తో సంబంధం లేకుండా కరక్కాయ, తేనె కొన్ని మూలికలు మాత్రమే ఉపయోగించి పనులు పూర్తి చేసేలా నిర్ణయం తీసుకున్నారు. దీంతో ప్రధాన ఆలయంతో పాటు వంటశాల, కల్యాణ మండపంలో కెమికల్ ట్రీట్మెంట్ పనులు చేయనున్నారు. కాగా ఆలయ చరిత్ర, శిల్పశాస్త్రానికి ఎలాంటి విఘాతం కలగకుండా పనులు చేయాలని దేవదాయశాఖ చీఫ్ ఇంజనీర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు, దేవదాయశాఖ స్థపతులు, ఆలయ వైదిక వర్గాల సూచనలు స్పష్టంగా పాటించాలని, తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో చీఫ్ ఇంజనీర్ ఆదేశించారు.

ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేయించుకోవాలి



విశాలాంధ్ర - పద్మనాభం : పద్మనాభం మండలం మండల వ్యవసాయ అధికారి ఏపీఎస్ చలం తెలియజేసిన వివరాల మేరకు ,రాష్ట్రంలోని రైతులకు కేంద్ర ప్రభుత్వం 'ఫార్మర్ రిజిస్ట్రీ' ద్వారా నిర్దిష్ట గుర్తింపు సంఖ్య (14 అంకెలు) జారీ చేస్తోంది. ఈ సంఖ్యను పొందడం రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అందుకోవడానికి చాలా అవసరం. ప్రస్తుతం ఏపీలోని వివిధ జిల్లాల్లో ఈ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. రైతులు తమ వివరాలను నమోదు చేసుకుని గుర్తింపు సంఖ్యను పొందాలి. విశిష్ట గుర్తింపు సంఖ్య పొందడానికి అవసరమైన డాక్యుమెంట్లు, ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ అయిన మొబైల్ నంబర్, పట్టాదారు పాసుపుస్తకం, గుర్తింపు సంఖ్య పొందడానికి ఎలా అప్లై చేయాలి? సమీప రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కె) సందర్శించాలి. కావాల్సిన డాక్యుమెంట్లను సమర్పించాలి. ఆర్ ఎస్ కె సిబ్బంది రైతు వివరాలను నిర్దేశిత పోర్టల్‌లో నమోదు చేస్తారు. నమోదు పూర్తైన వెంటనే, రైతుల మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని నమోదు చేయగానే ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. భూమి కలిగిన ప్రతి రైతు ఈ గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా పొందాలి. నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలి. ఏదైనా సమస్యలుంటే స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించండి. ఈ కొత్త వ్యవస్థ ద్వారా రైతులు ప్రభుత్వ పథకాల ఫలాలను సులభంగా పొందవచ్చు. గుర్తింపు సంఖ్యను పొందడం వల్ల లబ్ధిదారులను సరైన విధంగా గుర్తించడంతో పాటు, అక్రమ లబ్ధిదారుల సంఖ్య తగ్గుతుంది. రైతన్నలందరూ తమ వివరాలను త్వరగా నమోదు చేసుకుని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి అని తెలియజేశారు.

విద్యార్థులకు శారీరక మానసిక ఆరోగ్యం ఎంతో అవసరం

విశాలాంధ్ర - ఆనందపురం : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గంభీరం విద్యార్థులకు శారీరక మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని ప్రముఖ యోగ గురువు జాడే గంగాధరరావు అన్నారు. గంభీరం ప్రాథమిక పాఠశాలలో ఈరోజు విద్యార్థుల కోసం యోగా తరగతి నిర్వహించడం జరిగింది. విజయనగరంలో ప్రముఖ యోగా గురువు, రెండు పర్యాయాలు బంగారు పథకాలు పొందిన జాడే గంగాధరరావు విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. ప్రాణాయామం చేయడం వల్ల, యోగాసనాలు వేయడం వల్ల విద్యార్థులు రోజంతా ఉల్లాసంగా ఉంటారని, శారీరిక మానసిక ఆరోగ్యం లభిస్తుందని చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ట్రైనీ టీచర్స్ అందరూ ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. ప్రధానోపాధ్యాయుడు యు వి వి ప్రసాద్ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ఎటువంటి శారీరక రుగ్మతలు లేకుండా ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రతిరోజు విద్యార్థులంతా యోగా చేయడం, ధ్యానం చేయడం మంచిదని చెప్పారు. అనంతరం యోగ గురువుని పాఠశాల సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణ, లక్ష్మి ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీ భూలోకమాంబను దర్శించుకున్న కార్పొరేటర్ ముమ్మన

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 95వ వార్డు చింతలఅగ్రహారం నియర్ గవరపాలెం గ్రామ ఆరాధ్య దేవత శ్రీ భూలోక మాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం మంగళ వారం వైభవంగా జరిగింది. ఈ ఉత్సవాలలో గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పెందుర్తి బిజెపి నేత, స్థానిక జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొని, అమ్మవారికి పంచామృ తాభిషేకం కుంకుమ పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సర్పంచ్ దాడి గోపి వెంకట లక్ష్మి, మాజీ సర్పంచ్ లు అళ్ల తాతారావు, పుల మరశెట్టి వెంకటరావు, పులమరశెట్టి అప్పారావు, మరియు కాళ్ళ సురేష్, పిడివి.ప్రసాద్, మద్దాల శ్రీనివాసరావు, పుల మరశెట్టి లక్ష్మణ్, బొడ్డేటి జగదీశ్, ఆదారి సన్యాసిరావు, బొడ్డేటి గోవింద్ పాల్గొన్నారు.

పైడితల్లమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన బెహరా

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 91 వ వార్డు బుచ్చిరాజుపాలెం శ్రీ పైడితల్లమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ పైడితల్లమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం సందర్భంగా వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు బిబెహరా భాస్కరరావు అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పురెడ్డి ప్రకాష్ రెడ్డి, దొడ్డి రామచంద్రరావు, దేరెడ్ల సత్యనారాయణ రెడ్డి, సాయి, హరికృష్ణ, బలిరెడ్డి శ్రీను, ప్రసన్న వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ అధినేత జగన్‌తో అదీప్‌రాజ్ భేటీ

విశాలాంధ్ర - పెందుర్తి : మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డితో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ మంగళవారం సమావేశం అయ్యారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన భేటీలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ నిత్యం పార్టీ క్యాడర్ కు అందుబాటులో ఉండాలని నియోజకవర్గంలో పార్టీ క్యాడర్ ను అందరిని కలుపుకుంటూ ముందుకు సాగాలని జగన్ సూచించినట్లు అదీప్ రాజు కార్యాలయం ఒక ప్రకటనలో తెలియ జేసింది. 2029 సార్వత్రిక ఎన్నికల్లో పెందుర్తి నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసే విధంగా పనిచేయాలని ఆదేశించినట్లు వెల్లడించింది. నియోజవర్గంలో పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించి పార్టీలో గొడవలు తెచ్చే కార్యక్రమాలు చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు అంటూ హెచ్చరిక జారీ చేసినట్లు ప్రకటనలో పార్టీ వర్గాలు తెలియజేశాయి.

సుజాతనగర్ మహిళా మండలి 30వ వార్షికోత్సవం

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 97 వార్డు సుజాతనగర్ మహిళా మండలి 30 వ వార్షికోత్సవ మహోత్సవం మంగళవారం ఉత్సాహంగా జరిగింది. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు , మహిళా మండలి అధ్యక్షులు నూర్ భాషా, వార్డు అధ్యక్షులు సోమశేఖర్, దాట్ల మధు, పిన్నింటి పార్వతి, నాగ సుధా, స్థానిక ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో అభ్యర్థులందరూ అర్హులే...

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానంలో పోటీ చేసేందుకు నామినేషన్ వేసిన అభ్యర్థులందరి నామ పత్రాలు ఆమోదం పొందాయి. ఎన్నికల అబ్జర్వర్ ఎం.ఎం. నాయక్ ఆధ్వర్యంలో.. అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి, విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో పరిశీలన ప్రక్రియను నిర్వహించారు. అభ్యర్థులు సమర్పించిన అన్ని పత్రాలను సునిశితంగా పరిశీలించారు. పది మంది అభ్యర్థులూ మొత్తం 20 సెట్లు సమర్పించగా అందులో నాలుగు సెట్లు సరిగ్గా లేకపోవటంతో తిరస్కరణకు గురయ్యాయి. అయితే అభ్యర్థులు ప్రత్యామ్నాయ సెట్లు సమర్పించటంతో వాటిలో సరైన వాటిని రిటర్నింగ్ అధికారి పరిగణనలోకి తీసుకొని ఆమోదించారు. ప్రమాణాలకు అనుగుణంగా అందరి పత్రాలు ఉండటంతో పది మంది అభ్యర్థుల తాలూక నామినేషన్లను ఆమోదిస్తూ రిటర్నింగ్ అధికారి నిర్ణయం వెలువరించారు. అభ్యర్థుల సమక్షంలో జరిగిన పరిశీలన ప్రక్రియలో భాగంగా రిటర్నింగ్ అధికారి ఒక్కో అభ్యర్థి తాలూక పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అభ్యర్థులు సమర్పించిన పత్రాల తాలూక వివరాలను మిగిలిన వారికి తెలిసేలా చదివి వినిపించారు.

తుది జాబితా ప్రకారం 22,493 మంది ఓటర్లు



తుది విడత జాబితా ప్రకారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారని ఒక అభ్యర్థి అడిగిన ప్రశ్నకు బదులుగా రిటర్నింగ్ అధికారి, విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. తొలి విడత జాబితా ప్రకారం 21,555 మంది ఓటర్లు ఉండగా ఫిబ్రవరి 10వ తేదీ నాటికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది జాబితా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. కొత్తగా 938 మంది ఓటర్లు పెరిగారని వివరించారు. 13వ తేదీన సాయంత్రం 03.00 గంటల వరకు నామినేషన్ల ఉప సంహరణ ప్రక్రియ ఉంటుందని, అదే రోజు సాయంత్రం 03.30 గంటలకు పోటీలో ఉండే అభ్యర్థులందరితో సమావేశం ఉంటుందని హాజరుకావాలని రిటర్నింగ్ అధికారి విజ్ఞప్తి చేశారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియలో ఇన్‌ఛార్జి డీఆర్వో సీతారామారావు, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శలో ఉత్సాహంగా సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం

విశాలాంధ్ర - పెందుర్తి : స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాలలో సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం ఘనంగా నిర్వహించబడిందని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఇ. ఫ్లోరా ఒక ప్రకటనలో తెలియ జేసారు. ఈ సందర్భంగా బి.సి.ఎ, బి.ఎస్.సి విద్యార్థులు సాయి దుర్గా లక్ష్మి, అఖిల, యామిని, కె.భాగ్య శ్రీ, దేవి, సుచరిత, పి.భాగ్య శ్రీ, శాంతి ప్రియ, యాని జోయ్సి, కుస్మిత, పల్లవి సహా రెండో సంవత్సరం విద్యార్థులు వారి పి.పి.టిలు ప్రదర్శించారు. కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్ విద్యార్థులను అభినంధించారు. వైస్ ప్రిన్సపాల్ శ్రీనివాస్ రావు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సును ఎన్.ఎస్.ఎస్ మూడు యూనిట్ల ఆఫీసర్లు మంజుల, డి.ఎస్.ప్రదీప్ సంధ్యారాణి పర్యవేక్షించగా, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతరులు పాల్గొన్నారు.